# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రజాస్వామ్య దేశంలో అందరూ బాధ్యతగా ఓటు వేయాల్సిన అవసరముందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ రాష్ట్రంలోని మూడు శాసన మండలి స్థానాల ఎన్నికల ప్రక్రియ ఈరోజు ప్రశాంతంగా జరిగింది.
- ❖ యువత ఉన్నతమైన జీవన విధానం కోసం సేవా మార్గాన్ని ఎంచుకోవాలని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు సూచించారు.
- ❖ ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సాయంత్రం 4 గంటల సమయానికి 63.28.శాతం నమోదయ్యింది.
- ❖ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో రథోత్సవాణ్ని ఘనంగా నిర్వహించారు.

============================

ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఈరోజు ప్రశాంతంగా జరిగింది. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. అలాగే కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ కుడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎమ్మెల్సీ స్థానంలో మొత్తం 25 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఓటు వేసిన అనంతరం ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజాస్వామ్య దేశంలో అందరూ బాధ్యతగా ఓటు వేయాల్సిన అవసరముందన్నారు.

(వాయిస్ 38 సెకన్లు)

============================

రాష్ట్రంలోని మూడు శాసన మండలి స్థానాలకుగానూ జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను రాష్ట ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ స్వయంగా పరిశీలించారు. విజయవాడలోని పటమట, గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి

సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ జరుగుతున్న సరళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలోని ఆయన కార్యాలయం నుంచి కంట్రోల్ రూమ్ ద్వారా ఉత్తరాంధ్రలో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు, అలాగే ఉమ్మడి కృష్ణా గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఈరోజు ఎన్నికలు జరిగాయి.

==============================

యువత ఉన్నతమైన జీవన విధానం కోసం సేవా మార్గాన్ని ఎంచుకోవాలని పూర్వ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు సూచించారు. ఈ రోజు విశాఖలోని ఆధ్యాత్మిక సేవా సంస్థ గాయత్రి పరివార్ ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జీవితంలో కొంత భాగాన్ని విధిగా సమాజ సేవ కోసం కేటాయించాలని.. సాయం అనేది మనసు మీద ఆధారపడి ఉంటుందే తప్ప, స్థాయి మీద ఆధారపడి ఉండదనేది వివేకానందుని సందేశమని పేర్కొన్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడు కనీసం నెలలో 4 రోజులు... కచ్చితంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అలవాటు చేసుకున్నానని, క్రమశిక్షణతో కూడిన జీవన విధానంతో పాటు... సేవా మార్గంలో నడవడం జీవితంలో తనను ఉన్నత స్థాయికి చేర్చిందని వెంకయ్య నాయుడు తెలిపారు.

==============================

ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సాయంత్రం 4 గంటల సమయానికి 63.28.శాతం నమోదయ్యిందని ఉభయ గోదావరి జిల్లాల ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.వెట్రి సెల్వి తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా 72.03 శాతం,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా 67.74 శాతం, తూర్పుగోదావరి గోదావరి జిల్లా 60.03 శాతం, ఏలూరు జిల్లా 64.37 శాతం, కాకినాడ జిల్లా 59.01 శాతం, పశ్చిమగోదావరి జిల్లా 65.09 శాతం నమోదైందని వివరించారు.

==============================

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు 6 జిల్లాల పరిధిలో 4 గంటల సమయానికి 92.39 శాతం ఓటింగ్ నమోదయ్యింది. మొత్తం ఈ నియోజకవర్గంలో 5,223 మంది ఓటర్లు ఉండగా.. సాయంత్రం 4 గంటల వరకు 4,912 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.

==============================

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు రథోత్సవాణ్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వర్ణాభరణాలతో సుందరంగా అలంకరించిన శ్రీ సోమస్కందమూర్తి సమేత శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా దేవిని ఉత్సవంగా రథాల వద్దకు తీసుకొచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా సంకల్ప పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వేరు వేరు రథాలపై ఊరేగించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

విరామం

==============================

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం ద్వారా ఇల్లు లేని ప్రతి పేదవారు లబ్ధి పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నమయ్య జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ శివయ్య తెలిపారు. 2.0 కింద ఇప్పటి వరకు 1005 అప్లికేషన్లు ఆన్లైన్ చేసుకున్నారన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి ఒక్కరికి కేంద్ర ప్రభుత్వం నుంచి 1,50,000 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి లక్ష రూపాయలు ఆర్థిక సాయంతో పాటు ఎస్సీ, ఎస్టీలకు సప్లై నిధులనుంచి మరో 50 వేల రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. మొదటి దశలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్రం నుంచి అందాల్సిన సాయం పూర్తిగా లబ్ధిదారుల అకౌంటుకు చేరిందని ఆయన తెలియజేస్తూ....

(వాయిస్ 33 సెకన్లు)

==============================

పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం దుగ్గేరు గ్రామంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏఎస్పీ అంకిత సురాన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మారుమూల గిరిజన గ్రామాలకు అండగా నిలిచేందుకు కమ్యూనిటీ పోలీసింగులో భాగంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. ఈ శిబిరం ద్వారా సుమారు 500 మందికి పైగా గిరిజన ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. అనంతరం వృద్ధులకు, దివ్యాంగులకు, మహిళలకు దుప్పట్లు, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

==============================

ప్రకాశం జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి సైమన్ విక్టర్ తెలిపారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 67 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 42 వేల 678 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించామని, అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను వాట్సాప్ ద్వారా డౌన్ లోడ్ చేసుకోవచ్చన్నారు. పరీక్షలు మార్చి 1వ తేదీ నుంచి 20 వరకు జరుగుతాయని తెలియజేశారు.

==============================

తిరుమల శ్రీవారి దర్శనార్థం వేసవిలో వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని టీటీడీ అదనపు కార్యనిర్వహణ అధికారి సి.హెచ్.వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈ రోజు వేసవి సెలవుల యాత్రికుల రద్దీకి సంబంధించి చేయాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వేసవిలో యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. యాత్రికుల అవసరాలను తీర్చడానికి తగినంత లడ్డూల బఫర్ స్టాక్‌ను ఉంచాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను తగినంత అందుబాటులో ఉంచాలని వైద్య అధికారులకు ఆదేశించారు.

==============================

పదవ తరగతి పరీక్షలకు శ్రద్ధగా చదివి విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించాలని పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. పార్వతీపురం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు పట్టుదలతో చదవాలని సూచించారు. విద్యార్థులు బాగా చదవాలంటే ఆరోగ్యంగా ఉండాలని, అనీమియా పరీక్షలు చేయించుకొని, హిమోగ్లోబిన్ 11 శాతం కంటే తక్కువ లేకుండా చూసుకోవాలన్నారు.

==============================

ఏలూరు జిల్లా ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్నికలు మార్చి 2వ తేదీన జరుగుతాయని అసోసియేషన్ ఉపాధ్యక్షులు డి.కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్.హసీనా బేగం, సహాయ ఎన్నికల అధికారిగా షేక్.ఫయాజ్ అహ్మద్, ఎన్నికల పరిశీలకురాలిగా జె.కరుణ వ్యవహరిస్తారని వెల్లడించారు. ఏలూరు జిల్లాలోని ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ విభాగానికి సంబంధించిన ఉద్యోగులు ఈ ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు.

==============================

==============================